ప్రజాశక్తి
ఆదివారం 14 సెప్టెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి

కలెక్టర్‌గా శ్యాంప్రసాద్

బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లా నూతన కలెక్టర్‌గా శ్యాంప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం 1:30 గంటలకు కలెక్టర్ నేరుగా ప్రశాంతి నిలయంలోని శాంతి భవన్‌కు చేరుకున్నారు. అక్కడ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆనంద్ కుమార్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ రామసుబ్బయ్య తదితరులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చానన్నారు. జిల్లాలో తనకు అవినాభావ సంబంధాలు ఉన్నాయని, తన కూతురు ఇక్కడే విద్యాభ్యాసం చేసిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో ప్రభుత్వ సేవలను పారదర్శకంగా తీసుకెళ్లి జిల్లాలు అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల వేడుకలను అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగానికి కూడా ఎక్కువగా అవకాశాలు ఉన్నాయని దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రతి పౌరుడికి అవసరమైన సేవలను త్వరగతిన అందించడానికి అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పరిపాలన సమర్థవంతంగా నడిపేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో వెంకటనారాయణ తో పాటు సిబ్బంది కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల..

హక్కుల హరింపు..!

- కార్మికులను విస్మరిస్తూ పాలన
- ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వాల మెడలు వంచాలి
- ఎపి మధ్యాహ్న భోజన పథకం జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని
- అనంతలో ఘనంగా యూనియన్ రాష్ట్ర మహాసభలు
- పాల్గొన్న రాష్ట్ర ప్రతినిధులు

రాష్ట్ర మహాసభల జెండాను ఎగురవేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికుల హక్కులను హరిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయాలు చేస్తుంటే దానికి తలుపుతూ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పాలన సాగించడం అత్యంత దుర్మార్గమనిఎపి మధ్యాహ్న భోజన పథకం జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపి మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలు అనంతపురం గణేనాయక్ భవన్‌లో శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరలక్ష్మి, ఎం.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన మహాసభలకు ఆల్‌ఇండియా ప్రధాన కార్యదర్శి మాలినితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా రంజనా నీరులా ప్రాంగణంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి జెండాను ఎగురవేశారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టి ఇటీవల మరణించిన మధ్యాహ్న భోజన కార్మికులు, ఇతర కార్మికులు, నేతలకు జోహార్లు అర్పించారు. రాష్ట్ర కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టి మూడు సంవత్సరాల్లో చేపట్టిన కార్యక్రమాలు వివరించారు.

అనంతరం నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో మాలిని ప్రసంగించారు.

అనునిత్యం రాజకీయ వేధింపుల : మాలిని

ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలోనూ మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులకు గురి చేస్తూ తొలగింపులు చేస్తున్నారని మాలిని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులుగా 30, 40 సంవత్సరాలుగా సేవలందించినా కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపై ఇవ్వడం లేదన్నారు. రోజువారి కనీస వేతనం రూ.100 ఇస్తున్నారంటే ప్రభుత్వాలు వీరిని ఏ విధంగా గుర్తిస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు సంఖ్య పెరిగిందంటే అది మధ్యాహ్న భోజనం పథకం ద్వారానే అన్నారు. కార్మికులు వ్యయప్రయాశలకు ఓర్చి విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నారని చెప్పారు. ఇంత కష్టపడుతున్న కార్మికులను గుర్తించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు దేశ వ్యాప్తంగా కనీస వేతనం రూ.10 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా కలిపి వేతనం ఇవ్వాలన్నారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటుకు అప్పగించరాదన్నారు. మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

దయా రమాదేవి

రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ప్రతినిధులు

పోరాటమే మార్గం

దయా రమాదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసేలా కుట్రలు చేస్తోందన్నారు. వీటిని ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలన్నారు. బిజెపి ప్రభుత్వం మతతత్వ విధానాలతో కార్మికుల మధ్య చీలిక తెచ్చి పాలన కొనసాగిస్తోందన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, మురళి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక కార్మికుల పక్షాన సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ కోశాధికారి సుప్రజ, ఆఫీస్ బేరర్స్ మహాలక్ష్మి, సుధా, శివకుమారి, విజయమ్మ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, అంగన్‌వాడీ అధ్యక్షురాలు శకుంతల హాజరై సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాసభల్లో మాట్లాడుతున్న ఆలిండియా కార్యదర్శి మాలిని

ఎస్పీగా సతీష్ బాబు

సతీష్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా నూతన ఎస్పీగా సతీష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ శనివారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ రత్నను బదిలీ చేశారు. ఈమె స్థానంలో గుంటూరు జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సతీష్‌బాబును నూతన ఎస్పీగా నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్పీల బదిలీలను ప్రభుత్వం చేపట్టిన నేపథ్యంలో శ్రీ సత్యసాయి జిల్లాకూ కొత్త ఎస్పీ వచ్చారు.

సతీష్ కుమార్ తమిళనాడుకు చెందిన 2015 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన బీటెక్ బయోటెక్నాలజీ చదివి గ్రూప్-2కి ఎంపికై తమిళనాడు ట్రెజరీ శాఖలో రెండున్నర సంవత్సరాలు పనిచేశారు. 5వ ప్రయత్నంలో ఐపిఎస్ సాధించారు. చింతపల్లి అదనపు ఎస్పీగా, నర్సీపట్నంలో ఓఎస్‌డీగా, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా పనిచేశారు.

పిహెచ్‌సి తనిఖీ

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి, ఎనుములపల్లి అర్బన్ హెల్త్ సెంటర్లను శనివారం డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగం సంద ర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీకా నిర్వహణ గది, టీకా పెట్టెలను తనిఖీ చేశారు. పిహెచ్‌సిలకు వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకొచ్చి పేరు నమోదు చేసుకోవాల న్నారు. అలాగే వైద్యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం కోవెలగట్టుపల్లి అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సిహెచ్‌ఒలు, పిహెచ్‌సి వైద్య లు మునిచంద్రిక, వన్నప్ప, శివరామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

నూతన కమిటీ సభ్యులతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, సివిల్ సప్లై యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి-పెనుకొండ

కార్పొరేషన్ పరిధిలో పనిచేసే డిఇఒ, సెక్యూరిటీ, పంప్ బాయ్స్‌కు ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెనుకొండ స్టాక్ పాయింట్ వద్ద శనివారం లక్ష్మీపతి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఈఎస్ వెంకటేష్ హాజరై మాట్లాడారు. ముందుగా సివిల్ సప్లై స్టాక్ పాయింట్‌లో పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో సిఐటియులో చేరారు. ఆయన మాట్లాడుతూ స్టాక్ పాయింట్స్ పరిధిలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తగిన గుర్తింపు లేదన్నారు. వీరితో వెట్టిచాకిరి చేయించుకోవడం బాధాకరమన్నారు. జాతీయ సెలవులు, పండగ సెలవులు, టిఎ, డిఎ ఇవ్వకుండా పై స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. స్టాక్ పాయింట్ పరిధిలో ఏ చిన్న పొరపాటు జరిగినా గోడౌన్ ఇన్‌ఛార్జిలు తప్పించుకొని డిఇఒల మీద నెపం వేయడం శోచనీయమన్నారు. సెక్యూరిటీ గార్డ్స్‌కు వేతనాలు చెల్లించకపోవడ,ం ఇష్టారాజ్యంగా బదిలీలు చేయడం, భద్రత కల్పించకుండా ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమ న్నారు. ఆయా సమస్యలను గ్రీవెన్స్‌లో అధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

సివిల్ సప్లై స్టాక్ పాయింట్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా షమీవుల్లా, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీపతి, కోశాధికారిగా శివానంద్, ఉపాధ్యక్షులుగా శ్రీలక్ష్మి, వీరభద్ర, సహాయ కార్యదర్శులుగా మహబూబ్‌బాషా, రెడ్డి శేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల కన్వీనర్ బాబావలి, జిల్లాలో ఉన్న డిఇఒలు, సెక్యూరిటీ గార్డ్స్, పంప్‌బాయ్స్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగరాజు, బాబావలి మాట్లాడుతూ సీతారాం ఏచూరి తమ జీవితాన్ని ప్రజలు, కార్మికుల కోసం అంకితం చేశారని తెలిపారు. రాజ్యసభ సభ్యునిగా దేశానికి సేవ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బావమ్మ, మహబూబ్ బాషా, నరసింహ, సుధాకర్, హనుమంతు, వలి, తిప్పన్న, సలీం, బాబు, నాగేంద్ర, ఓబులేసు పాల్గొన్నారు.

మళ్లీ త్రిసభ్య కమిటీలే..?

- సహకార సంఘాలకు ఎన్నికలు లేనట్టే
- కమిటీ సభ్యులతోనే పాలన
- రాజకీయ నిరుద్యోగులకు పదవులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వాలు మారినా సహకార సంఘాలకు రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఎన్నికలు మాత్రం నిర్వహించని పరిస్థితి నెలకొంది. సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేసిన పరిస్థితి ప్రస్తుతం కన్పిస్తోంది. 2018 నుంచి ఇప్పటి వరకూ సహకార సంఘాలకు రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీల పేరుతో ప్రభుత్వాలు సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుతో సహకార సంఘాల్లో అవినీతి మరింత పెచ్చు మీరుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కూటమి సర్కార్ సైతం సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు హిందూపురం మండలం కిరికెర పిఎసిఎస్‌కు అధ్యక్షులుగా పి.శంకరప్పతో పాటు నారాయణ రెడ్డి, పి.అన్నెమ్మలను మెంబర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం మండలం గొట్లూరు పిఎసిఎస్‌కు అధ్యక్షులుగా మేకల రామాంజినేయులు, వెంకటేశు, రవి కుమార్‌లను మెంబర్లుగా నియమిస్తు ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ నిర్ణయంపై రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఎన్నికలు ఎగ్గొటి త్రిసభ్య కమిటీలను నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 115 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 5,29,956 మంది సభ్యులుగా ఉన్నారు. జిల్లాలో రైతులకు సహకార సంఘాలు ఎంతో దన్నుగా నిలుస్తున్నాయి. లక్షలాది మంది రైతులు సహకార సంఘాల్లో రుణాలు తీసుకుని వ్యవసాయం సాగిస్తున్న పరిస్థితి ఉంది. సహకార సంఘాలకు రాజ్యాంగ బద్ధంగా ఐదేళ్లకొకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లను అందులోని సభ్యులు తమ ఓటు ద్వారా ఎన్నుకుంటారు. ప్రతి సహకార సంఘానికి 12 మంది వరకు డైరెక్టర్లు ఉంటారు. ఎస్టీ కోటా ఉన్నచోట 13 మందితో కమిటీ ఉంటుంది. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించింది. 2018 జనవరితో వాటి పదవీ కాలం ముగిసింది. అప్పట్లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం సాధారణ ఎన్నికలు దగ్గర పడటంతో పదవీకాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ముందుకు సాగింది. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీని నియమించింది. ఒకరిని ఛైర్మన్‌గా, ఇద్దరు సభ్యులను ఏర్పాటు చేసి ఐదేళ్ల కాలక్షేపం చేసింది. అప్పట్లో దీనిపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. వైసిపి బాటలోనే ప్రస్తుత కూటమి సర్కార్ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి రాగానే వైసిపి ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలను రద్దు చేసి, వాటి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో సహకార ఎన్నికలు జరగడం ఖాయమని అంతా భావించారు. ఏడాది తర్వాత ఎన్నికలకు తిలోదకాలు ఇచ్చేసి త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు పూనుకుంది. ఈ త్రిసభ్య కమిటీల ఎంపికలో టిడిపి, జనసేన, బిజెపి నేతలకే అవకాశం ఇచ్చినట్లు చెబుతున్నారు. త్రిసభ్య కమిటీల నియామకం కారణంగా రైతులకు ఏవిధమైన న్యాయం జరగదని ఇప్పటికే విమర్శలు విన్పిస్తున్నాయి. తాము ఓటు వేసి గెలిపించిన నాయకులను అయితే వెళ్లి నిలదీసే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజధానిపై జగన్ రివర్స్ డ్రామా : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

రాజధాని అమరావతిపై జగన్ రివర్స్ డ్రామాకు తెరతీశారని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత మండి పడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అమరావతిపై మరో జగన్నాటకానికి తెరతీశారని శనివారం ఆమె ఓ ప్రకటనలో విమర్శించారు. ఏరు దాటాక తెప్ప తగలేసే రకం జగన్ నైజం అన్నారు. 2019 ఎన్నికల సమయంలో అమరావతే రాజధాని అని, తన నివాసం ఇక్కడే ఉందని ప్రజలను నమ్మబలికారన్నారు. అధికారంలోకి రాగానే మాట మార్చేసి మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరతీశారన్నారు. అయిదేళ్లలో ఏ ఒక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా, రాజధాని లేని రాష్ట్రానిగా ఎపిని భ్రష్టు పట్టించారన్నారు. అమరావతిని శ్మశానమని, మునిగిపోయే ప్రాంతమని చులకన చేసి జగన్ సహా వైసిపి నాయకులంతా మాట్లాడారన్నారు. ఆంధ్రుల చిరకాల కల అమరావతి కోసం భూములిచ్చిన రైతులు, మహిళలను పెయిడ్ ఆర్టిస్టులంటూ హేళన చేశారన్నారు. వారిని నిర్బంధాలకు గురిచేస్తూ పోలీసులతో కొట్టించారన్నారు. జగన్ అరాచక పాలనతో విసిగి పోయిన యావత్ ఎపి ప్రజలు ఛీ కొట్టి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. నిన్నగాక మొన్న తన నీలి మీడియాలో అమరావతి వేశ్యల నగరమంటూ సభ్య సమాజం సిగ్గుపడేలా తప్పుడు మాటలు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇన్ని విధాలా అమరావతిపై విషంకక్కిన జగన్ ఇపుడు రాజధానికి అనుకూలమంటూ చెప్పడం మరో జగన్నాటకానికి తెర తీయడమే అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికిని కాపాడుకోడానికి జగన్ ఆడుతున్న రివర్స్ డ్రామా అని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, తమ కలల రాజధాని సాకారం అవుతుందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని మంత్రి సవిత స్పష్టం చేశారు.

బలవంతపు భూ సేకరణ తగదు : రైతుసంఘం

నూతన కమిటీ సభ్యులతో రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-రొద్దం

సోలార్ కంపెనీల పేరుతో చేపడుతున్న బలవంతపు భూ సేకరణ ఎపి రైతు సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న తెలిపారు. స్థానిక రొద్దకమ్మ ఆలయ ఆవరణలో శనివారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు ఫకృద్దీన్ అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న హాజరై మాట్లాడారు. పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు పెరిగి, గిట్టుబాటు ధర దక్కక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో రోజు రోజుకూ సాగు విస్తీర్ణం తగ్గుతుందన్నారు. అకాల వర్షాలు, సమయానికి ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా ప్రభుత్వాల సహకారం అంతంత మాత్రంగానే ఉందన్నారు. విధి లేని పరిస్థితుల్లో రైతులు, రైతు, వ్యవసాయ కూలీలు కుటుంబ పోషణ కోసం వలస పోతున్నారన్నారు. ఇక సోలార్ కంపెనీలకు జిల్లా వ్యాప్తంగా 50 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములను రైతుల నుంచి లీజు పేరుతో బలవంతగా తీసుకోవడం తగదన్నారు. అధికార పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇష్టారాజ్యంగా ఇసుకను అక్రమంగా తవ్వి కర్నాటకకు తరలిస్తున్నా అడ్డుకునే వారే లేరన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.శ్రీనివాసాచారి, ఆర్.గిరీష్, సభ్యులుగా రుద్రప్ప, రామాంజనేయులు, ఆర్.వెంకటేష్, బి.హనుమంతు, ఎం.రామాంజునేయులు, హనుమయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా వెంకటేశులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

హిందీభాషా దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్ డిఎస్ నందకుమార్ లు భరతమాత చిత్ర పటానికి పూల మాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృభాషకు ఎంత ప్రాధన్యత ఇస్తామో అంతే ప్రాధన్యత జాతీయ భాషకు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇంగ్లీష్, హిందీ రెండు భాషలు నేర్చుకుంటే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా రాణించగలం అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఈ రెండు భాషలపై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గాయిత్రి, ఎఒ భాస్కర్, సూపరిండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూపురం రూరల్ మండలం సంతేబిదనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జాబేజ్ ఆద్వర్యంలో హిందీ భాష దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతితిగా వనజ, హిందీ ఉపాధ్యాయుని తాహేర బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రాజీ కేసులకు చక్కటి పరిష్కారం 'లోక్ అదాలత్'

పుట్టపర్తి లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, న్యాయవాదులు

కదిరిలో కేసులు పరిష్కరించిన తర్వాత అధికారిక పత్రాలను అందజేస్తున్న జడ్జి జయలక్ష్మి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 64 కేసులను పరిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ చిన్నపాటి తగాదాలు, మనస్పర్థల మూలంగా పట్టింపులకు పోయి కేసులు నమోదు చేసుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా కేసులకు పరిష్కారం చూపుతున్నామన్నారు. తద్వారా కక్షిదారుల మధ్య సత్సంబంధాలు ఏర్పడి గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి దోహదం చేస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగు తుందని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, అతావుర్ రెహ్మాన్, వెంకట రమణప్ప, లెక్కల యదుభూషణ్, కృష్ణప్రసాద్, భారతిరెడ్డి, కుంచెపు శ్రీనివాసులు, నాగేంద్ర, మౌనిక, కిరణ్, క్లర్కులు మంజునాథ్, జ్యోతిబాయి, లక్ష్మానాయక్, వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు .

ఖర్చు లేకుండా కేసులు పరిష్కారం

కదిరి టౌన్ : రూపాయి ఖర్చు లేకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించబడతాయని మండల న్యాయ అధికార సేవా సంస్థ ఛైర్మన్, న్యాయమూర్తి ఎస్.జయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజల మధ్య ఏర్పడిన అగాధాలను సమన్వయపరిచి ప్రజా సంక్షేమాన్ని కాంక్షించేదే ప్రజా న్యాయస్థానమని తెలిపారు. ఇరువర్గాలను ఒప్పించి వారి ఆమోదంతోనే కేసులను పరిష్కరిస్తామన్నారు. జయలక్ష్మి నేతృత్వంలో ఒక బెంచ్, న్యాయాధికారి లోకనాథం నేతృత్వంలో మరో బెంచ్ ఏర్పాటు చేసి మొత్తం 670 పైచిలుకు కేసులను పరిష్కరించారు. అందులో న్యాయవాదులు కె.నరసింహులు, జ్ఞానవర్ధన్‌రెడ్డి, న్యాయ సహాయకులుగా లోకేశ్వర్‌రెడ్డి, రఘు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చౌడప్ప, వివిధ బ్యాంకుల అధికారులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కేసుల పరిష్కారంలో రాజీమార్గం ఎంతో ఉత్తమమని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి జాతీయ మెగా లోక్ అదాలత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కక్షలు, కార్పణ్యాల జోలికి వెళ్లకుండా రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో భాగంగా మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 95 కేసులను పరిష్కరించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కక్ష దారులకు, న్యాయస్థానాల సిబ్బంది, న్యాయ వాదులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ నగేష్, లోక్‌అదాలత్ సభ్యులు సిద్దు, రవిచంద్ర, సంతోషి కుమారి, మురళి, కళావతి, యూసుఫ్ లోక్‌అదాలత్ హేమావతి పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : రాజీమార్గమే రాచ మార్గం అవుతుందని సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్(జూనియర్ డివిజన్) బొజ్జప్ప తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 28 కేసులను పరిష్కరించారు. ఈ కేసులన్నీ రాజీకి తగ్గ కేసులు మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ వాదులు డిఎల్ఎన్ మూర్తి, వెంకటరామిరెడ్డి, బిల్లే రవీంద్ర, పెద్దన్న పాల్గొన్నారు.

మడకశిర టౌన్ : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జడ్జి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 100 కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కోర్టు భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన

కోర్టుల భవనాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్జి రామకృష్ణప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలో జిల్లా కోర్టు, ఇతర కోర్టుల భవనాల నిర్మాణం కోసం హైకోర్టు జడ్జి జి.రామకృష్ణ ప్రసాద్ స్థలాన్ని పరిశీలించారు. కొత్తచెరువు-పుట్టపర్తి ప్రధాన రహదారిలో మామిళ్లకుంట క్రాస్ వద్ద జిల్లా పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న పదెకరాల భూమిలో జిల్లా కోర్టు, ఇతర కోర్టుల భవనాల నిర్మాణం చేపట్టాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో శనివారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి ఆ భూమిని పరిశీలించారు. కోర్టుల భవన నిర్మాణాలకు కావాల్సిన భూమిని ఇప్పటికే రెవెన్యూ అధికారులు చదును చేసి సిద్ధం చేశారు.

హైకోర్టు జడ్జికి ఘన స్వాగతం

పుట్టపర్తి అర్బన్ : ఎపి హైకోర్టు జడ్జి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్‌కు ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ వద్ద జెసి అభిషేక్‌కుమార్, ఆర్డీవో సువర్ణ, హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి శైలజ, పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి సయ్యద్ ముజీబ్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జడ్జి శాంతిభవన్ నుంచి కప్పలబండ గ్రామ పొలంలో జిల్లా కోర్టు ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. జడ్జి మాట్లాడుతూ మెరుగైన స్థలాన్ని ఎంపిక చేసి కోర్టు భవనం నిర్మిస్తామన్నారు. జడ్జి వెంట జెసి అభిషేక్‌కుమార్, ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, రెవెన్యూ కోర్టు సిబ్బంది ఉన్నారు. సాయంత్రం జడ్జి సాయి కుల్వంత్ మందిరంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. జడ్జికి సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ట్రస్టు సభ్యులు స్వాగతం పలికారు. రాత్రికి జడ్జి ఇక్కడే బస చేస్తారని అధికారులు తెలిపారు.

జడ్జికి బార్ అసోసియేషన్ వినతి

పుట్టపర్తిలో జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణాలకు అవసరమైన స్థల కేటాయింపులో చొరవ చూపాలని కోరుతూ పుట్టపర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జి జి.రామకృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. జడ్జి సత్యసాయి మహాసమాధి దర్శనార్థం ప్రశాంతినిలయం రాగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో న్యాయవాదులు అథావుర్ రెహ్మాన్, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, లెక్కల యధుభూషణ, భారతి రెడ్డి, సతీష్‌రెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి

లేపాక్షి : స్థానిక శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని ఎపి హైకోర్టు జడ్జి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ విశిష్టతను వివరిం చారు. ఆలయంలోని శిల్ప కళ సంపద, తైల వర్ణ చిత్రాలు, ఏక శిలా నందిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనంతరం ఈవో నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో సత్కరించారు. జడ్జి వెంట జిల్లా అదనపు జడ్జి శైలజ, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, రూరల్ సిఐ జనార్ధన్, డిటి కుమార్‌రెడ్డి ఉన్నారు.

శాశ్వత భవనాలు నిర్మించాలని వినతి

హిందూపురం : హిందూపురం న్యాయస్థాన సముదాయంలో నూతన భవనాలను మంజూరు చేసి నిర్మించాలని అనంతపురం జిల్లా పరిపాలన న్యాయమూర్తి జి.రామకృష్ణ ప్రసాద్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. లేపాక్షికి విచ్చేసిన ఆయన్ను స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నెరవప్ప, న్యాయవాది శివశంకర్‌లు కలిసి వినతిపత్రం అందించారు. జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థాన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం పశుసంవర్థక శాఖ ఆధీనంలో ఉన్న తాత్కాలిక భవన సముదాయాల్లో న్యాయస్థానాల నిర్వహణ జరుగుతోందన్నారు. వీటి స్థానంలో శాశ్వత కోర్టు భవనాలు నిర్మించాలని కోరారు. జూనియర్ సివిల్ జడ్జి పోస్టు గత మార్చి మాసం నుండి ఖాళీగా ఉందని, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రస్తుతం శిక్షణలో ఉన్నారని, దీనివల్ల కేసుల పెండింగ్ పెరుగుతోందన్నారు. ఈ జడ్జిలను త్వరితగతిన నియమించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన జనసేన నాయకులు

కదిరి టౌన్ : జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను శనివారం పుట్టపర్తిలో కదిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరప్రసాద్, నాయకులు శివశంకర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జనసేన పార్టీ నాయకులు చిన్నపరెడ్డి, అంజిబాబు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం రూరల్ : కనగానపల్లి ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పోతుకుంట సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ జానకిరామయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోతుకుంట, బృందావనం కాలనీ, రేగాటిపల్లి, కట్టకిందపల్లి, కామిరెడ్డిపల్లి, కుఋతూరు, ముచ్చురామి, తదితర ప పల్లెలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

15న పశువులకు టీకా

గాండ్లపెంట : మండలంలో ఈ నెల 15వ తేదీ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్నట్లు పశువైద్యాధికారి బి.చెన్నకేశవ నాయక్ తెలిపారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీజన్‌ను దృష్టిలో ఉంచకుని పశువులకు ముందు జాగ్రత్తగా ఈ టీకా వేస్తున్నట్లు తెలిపారు. పశువుల కాపర్లు ఆయా గ్రామపంచాయతీల్లో పశువైద్య సిబ్బందిని సంప్రదించి పశువులకు టీకా వేయించుకోవాలని సూచించారు.

'చలో విజయవాడ' కరపత్రాలు విడుదల

నల్లమాడ : కార్మికుల సమస్యలపై ఈ నెల 15వ తేదీ నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నల్లమాడలో 'చలో విజయవాడ' కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోవిందు, మల్లికార్జున, రామయ్య, సిఐటియు నాయకులు గంగులప్ప, వెంకటస్వామి, జిల్లా కోశాధికారి అంకె ముత్యాలప్ప పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్

ముదిగుబ్బ : మండలంలోని ఉప్పల పాడు సమీపంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేసినట్లు సిఐ జి.శివరాముడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి సమయంలో చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 టిప్పర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

యుటిఎఫ్ రణభేరిని జయప్రదం చేద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిపి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి చేపట్టనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాల యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి ఆర్.రామకృష్ణనాయక్ మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు కర్నూలు నగరంలో ప్రారంభం అవుతుంద న్నారు. 16న అనంతపురం జిల్లా, 17న శ్రీసత్యసాయి, 18వ తేదీ అన్నమయ్య, కడప, 19వ తేదీ కడప, నంద్యాల జిల్లాల్లో కొనసాగుతుందన్నారు. రణభేరిలో ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 12వ పిఆర్‌సి కమిషన్ వేయాలని, డిఎలు ఇవ్వాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని, ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి మినహాయించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, జింకా హరికృష్ణ, నాగిరెడ్డి, హెచ్.రామాంజనేయులు, సాయిగణేశ్, ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, రామ్ ప్రసాద్, బిల్లే రామాంజనేయులు, వెంకటకిషోర్, తదిత రులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ఫ్రెషర్స్ డేలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ భక్తవత్సలం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహిం చారు. జూనియర్ విద్యార్థులకు సీనియర్లు ఘనంగా స్వాగతం పలికారు. ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, భక్తవత్సలం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే అత్యుత్తం ఫలితాలు సాధించ వచ్చు అన్నారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత పదవులను అలంకరించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే గుణాత్మక విద్యను అభ్యసించాల న్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆజాద్, అరవింద్, బాలమోహన్, కవిత, అర్షియ, గోవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల్లో పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తచెరువు

బుక్కపట్నం చెరువు కింద ఉన్న ఆయకట్టుకు నీరు వెళ్లే కాలువల్లో పూడికతీత పనులను శనివారం సాగునీటి సంఘం అధ్యక్షులు నవీన్‌కుమార్, ఇరిగేషన్ జేఈ జమునాబాయ్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ సాగునీటి కాలువల్లో పెరిగిన ముళ్ల పొదలను హిటాచి సాయంతో తొలగిస్తున్నామ న్నారు. కాలువల పనులను వేగవంతంగా పూర్తి చేసి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తామ న్నారు. ఎక్కడైనా కాలువలు ఆక్రమణకు గురై ఉంటే గుర్తించి త్వరలోనే తొలగింపు పనులు చేపడతా మన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం మెంబర్ చలపతి, మానవ హక్కుల సంఘం నాయకులు పాపన్న పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన టిడిపి నేతకు పరామర్శ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశగాళ్ల శ్రీనివాసులు ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ శనివారం పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. శ్రీరామ్ వెంట రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, నాయకులు సందా రాఘవ, నాగూర్ హుస్సేన్, పెద్దన్న, పురుషోత్తంగౌడ్, కేతా శ్రీనివాసులు, చంద్ర, బొట్టు కిష్ట , రాజన్న, వీరయ్య, సాయి, తదితరులు ఉన్నారు.

రాజకీయ హడావుడి..!

ప్రజశక్తి - అనంతపురం ప్రతినిధి

జల్లాలో ఈ వారంలో రాజకీయంగా హడావుడి నడిచింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న హామీల అమలుపై పెద్ద సభను నిర్వహించింది. 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' పేరుతో టిడిపి,జనసేన, బిజెపి కలిపి అనంతపురంలో భారీ బహిరంగ సభను నిర్వహించింది. దీన్ని విజవంతం చేయడానికి వారం రోజలకుపైగా అధికారపార్టీ నేతలు పెద్దఎత్తున కసరత్తులు చేశారు. ప్రధానంగా ఐదారుగురు మంత్రులు ఇక్కడే మకాం వేసి నిరంతరంగా ఏర్పాట్లు పరిశీలించారు. పార్టీ సభ అని చెప్పినప్ప టికీ జన సమీకరణకు అధికార యంత్రాంగాన్ని భారీగానే వినియోగించారు. ఎన్నికల సమయంలో జరిగే విధంగా ఇప్పుడే సభను పెద్దఎత్తున నిర్వహించడం, జన సమీకరణ చేపట్టారు. ఈ సభ రాయలసీమ వ్యాప్తంగా అని చెప్పినప్పటికీ ఉమ్మడి అనంతపురం జల్లాలోనే ఎక్కువగా జరిగింది. ఇందులో గడిచిన 15 నెలల కాలంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించే ఎక్కువగా చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని చెప్పడంతో పాటు వాహనమిత్ర పేరుతో ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామని ఈ సభలో ప్రకటించారు. ఇలా ఎన్నికల ప్రచార కార్యక్రమంలాగా ఈ సభ జరిగిందన్న చర్చ నడుస్తోంది. అమలు చేయని హామీల పరిస్థితి గురించి వైసిపి ప్రశ్నిస్తోంది. ఈ సభకు ఒక రోజుముందు రైతు సమస్యలపై నిరసనలు చేపట్టింది. యూరియా కొరతపైనే కాకుండా మహిళలకు నెలకు రూ.1500 ఇచ్చే కార్యక్రమం వంటివి గురించి ప్ర స్తావించారు. సూపర్ హిట్ సభలో వీటి ప్రస్తావనేదీ రాలేదు. ఇకపోతే హంద్రీనీవా బిటిపి, పేరూరు పూర్తి చేస్తామని ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో వర్షాలు కూడా విస్తారంగా పడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో వాగులు, వంకల్లోకి నీటి ప్రవాహం కనిపిస్తోంది. ఇప్పటికీ వరకు ఐఎబి సమావేశం నిర్వహించకపోవడం చర్చనీయాంశమైంది. ఈసారి రబీలో ఆయకట్టుకు అయినా నీరు విడుదలపై ఎటువంటి చర్యలుండను న్నాయన్నది తెలియక ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల గడుస్తూ రబీ సీజన్ కూడా ఆరంభం కానుంది. ఒకవైపు ప్రకృతి అనుకూలంగానున్న నిర్దష్టంగా అధికారుల నుంచి చర్యలుండటం లేదన్న విమర్శలున్నాయి. ఇంతలోపే ఉమ్మడి జల్లా కలెక్టర్లు బదిలీ అయ్యారు. అనంతపురం కలెక్టర్ వినోద్ కుమార్, సత్యసాయి జల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ బదిలీ అయ్యారు. వారి స్థానంలో అనంతపురంకు ఆనంద్‌కుమార్, సత్యసాయి శ్యాం ప్రసాద్ వచ్చారు. సత్యసాయి ఎస్పీ రత్నకుమారి కూడా బదిలీ అయ్యారు. ఈ సమయంలో కొత్త వారు బాధ్యతలు తీసుకుని జల్లా పట్ల అవగాహన చేసుకోవడానికే చాలా సమయం పట్టే అవకశముంది. అంతలోపు సీజన్ ముందుకు గడిస్తే మరింత గందరగోళం నెలకొనే అవకాశం ఉంది. ప్రజ ప్రతినిధులు కూడా ఈ అంశాలపై ఈ సమస్య గురించి పెద్దగా స్పందిస్తున్న దాఖలాల్లేవు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సరైన వర్షాల్లేక పంటల్లేకపోయినప్పటికీ ఆగస్టు నుంచి వర్షాలు మొదలయ్యాయి. సెప్టంబర్ మాసంలోనూ మంచి వర్షాలే పడుతున్నాయి. ఈ వారం రోజులుగానూ మంచి వర్షాలు పడుతున్నాయి. దీంతో రబీపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలైనా ఇచ్చి ఉంటే అదును తప్పాక కనీసం ఆ పంటలైనా సాగు చేసుకునేందుకు వీలుండేది. ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ చేపట్టలేదు.

అంగన్వాడీల సంబరాలు

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంపై సిఐటియు అనుబంధం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో శనివారం సమావేశం నిర్వహించి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా నాయకులు జిఎల్. నరసింహులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్వాడీల సమస్యలపై 42 రోజుల పాటు సమ్మె నిర్వహించగా అప్పడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి ఇచ్చిన హామీ మేరకు మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మారుస్తూ జీవో జారీ చేయడం అంగన్వాడీల పోరాట ఫలితమే అన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎలిజబెత్ రాణి, సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు విలువలు, సంస్కారం అవసరం

బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రిన్సిపల్, డీన్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విద్యార్థులు విద్యతో పాటు విలువలు, సంస్కారం నేర్చుకోవాలని పట్టణంలోని రిషి విద్యాలయ ప్రిన్సిపల్ కరణ్ స్వరూప సింగ్, డీన్ భాస్కర్‌రెడ్డి సూచించారు. మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం 'రిషి విద్యాలయ'లో 6, 7 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. ఇందులో 6వ తరగతికి చెందిన జి.శాన్విరెడ్డి, 7వ తరగతి చెందిన సి.నిఖిల్, ఎస్.మోక్షమాధవి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా ప్రిన్సిపల్, డీన్ బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం సంస్థ సభ్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ మంజు నాథ్, సెక్రటరీ కోనాపురం సాయిప్రసాద్, డైరెక్టర్ సోమేశ్వర్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు మారుతి, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-హిందూపురం

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని యూటీ యూసీ రాష్ట్ర కార్యదర్శి ఏ.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు కార్మిక గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందాల్సిన సంక్షేమాన్ని పునరుద్ధరించాలని కోరారు. నిర్మాణ కార్మికుల కుటుంబానికి ఎంతో ఉపయోగక రంగా ఉన్న సంక్షేమాన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు. కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమాన్ని అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటియుసి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గోరంట్ల : పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల సమీపంలో రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం మండల టిడిపి నాయకులు భూమిపూజ చేశారు. టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులు, తదితర అభివృద్ధి పనులు విస్తృతంగా చేపడుతుందన్నారు. ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందజేస్తుంద న్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మల శ్రీధర్, అజమతుల్లా, జయరామ్, బాలు, ఆంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, నరేష్, విద్యాధరణి, శ్రీనివాసులు, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

గుడిబండ : మండలంలోని ఎస్.రాయపురం గ్రామంలో వైసిపికి చెందిన చాకలి నాగరాజు, భారతి ఆ పార్టీని వీడి టిడిపిలో చేరారు. వారికి శనివారం మడకశిర పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, ఎస్.రాయపురం గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందలపల్లి సర్పంచికి పరామర్శ

గుడిబండ : మండలంలోని మందలపల్లి పంచాయతీ సర్పంచి అశ్వత్థ్ కొన్ని రోజుల నుంచి జ్వరంతో బాధ పడుతూ కర్నాటకలోని తుముకూరు పట్టణంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం ఆ ఆసుపత్రికి వెళ్లి అశ్వత్థ్‌ను పరామర్శించారు. ఆయన వెంట మోరుబాగల్ సర్పంచి తిప్పేస్వామి, నాయకులు పాండు, ఈరన్న ఉన్నారు.

నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

కొత్తచెరువు రూరల్ : మండలంలోని తలమర్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం మారుతిరెడ్డి తన తండ్రి కేశవరెడ్డి జ్ఞాపకార్థం 50 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మారుతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులు, పాఠశాల, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభ, రాకేష్, కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి చేనేత విభాగం అధ్యక్షుడికి సన్మానం

సోమందేపల్లి : జడ్పిటిసి డిసి అశోక్‌ను వైసిపి చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమించడంతో శనివారం వైసిపి టౌన్ అధ్యక్షులు గోవిందమ్మ గారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు పూలమాలలు, శాలు వాలతో సన్మానించారు. అశోక్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ అవకాశం ఇచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంజు, ఎంపిటిసి సాయిరాం, రమేష్, శ్రీరాములు, శివ, చంద్రనాయక్, మురళి, ఆదినారాయణరెడ్డి, మహేష్, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కంటి జబ్బులపై జాగ్రత్తలు అవసరం

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-హిందూపురం

కంటికి సంబంధించిన జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రినిటీ సర్వీసెస్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణిలు సూచించారు. శనివారం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో సంబంధిత సంస్థ ఆధ్వర్యంలో 126వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు యశస్వి, షిఫా కంటి జబ్బులతో బాధపడుతున్న బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 550 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 175 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వీరందరికీ బెంగుళూరులోని శంకర్ నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు, కంటి అద్దాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ నరసింహా మూర్తి, రాజు, క్యాంప్ ఇన్‌ఛార్జి శివ ప్రకాశ్, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. ఒకరి మృతి..

చిలమత్తూరు : స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. తుమ్మలకుంట నుంచి బాగేపల్లి వైపు వెళ్తున్న బైక్, హిందూపురం వైపు నుంచి మరో బైక్ స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద వేగంగా ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో చిలమత్తూరుకు చెందిన శ్రీనివాస్(40), తుమ్మలకుంట గ్రామానికి చెందిన నాగేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బాగేపల్లి ఆసుపత్రికి తరలించగా శ్రీనివాసులు చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగేష్‌ను బెంగళూరుకు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

బుక్కపట్నం : ఎద్దులబండి కింద పడడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలం లోని జానకంపల్లి గ్రామానికి చెందిన హేమంత్‌కుమార్(19) శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. వినాయక చవితి పండుగ సందర్భంగా గత నెల 28వ తేదీ జానకంపల్లి గ్రామ సమీపంలో ఎద్దుల పోటీలు నిర్వహించగా పరిగెడుతున్న ఎద్దుల బండిని సెల్ఫీ తీసే క్రమంలో హేమంత్‌కుమార్ ప్రమాదవశాత్తూ ఎద్దుల బండి కింద పడి తీవ్రంగా గాయ పడ్డాడు. అతడు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. హేమంత్ కుమార్ తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లాటరీ విక్రేతలు అరెస్టు

కదిరి టౌన్ : ఐదుగురు లాటరీ విక్రేతలను కదిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 47 లాటరీ టిక్కెట్లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ బాబ్జాన్ వెల్లడించారు. జయప్రకాష్ బాబు, బాబా ఫక్రోద్దీన్, సాలర్ సాబ్, నవీన్ కుమార్, మహమ్మద్‌అలీలు అన్నమయ్య జిల్లా మదనపల్లి రాయచోటి ప్రాంతాల నుంచి లాటరీ టిక్కెట్లు తీసుకొచ్చి పట్టణంలో పలు ప్రాంతాల్లో విక్రయిస్తుండేవారు. వీరిపై నిఘా ఉంచి శనివారం కుటాగుళ్ల రైల్వేగేట్ వద్ద అరెస్టు చేశారు. వీరితో పాటు కదిరికి చెందిన వేమారెడ్డి, ఇబ్రహీం సాబ్, షఫీ, రామాంజనేయులు, మదనపల్లికి చెంది న గోడి బాబా, అనిల్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిని త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నల్లమాడ : మండలంలోని వేళ్లమద్ది గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన ఎస్.నరసింహులు (55) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే టిడిపి నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణంనాయుడు, కోట్లో మంజురెడ్డి ఆ గ్రామం వెళ్లి నరసింహులు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భార్య ఓబుళమ్మను పరామర్శించి రూ. 5వేలు అందజేశారు. వారి వెంట మిలిటరీ రహిమాన్, డీలర్ నారాయణస్వామి, పూల రామయ్య, కొండ్రెడ్డి బయారెడ్డి, యానిమేటర్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌కుమార్, ఎం.రవికుమార్, డి.బాలిరెడ్డి, విఆర్ఎ వి.శ్రీనివాసులు ఉన్నారు.

విద్యార్థిని చికిత్సకు చేయూత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని శ్రీసత్యకృపా మహిళా డిగ్రీ కళాశాలలో బిబిఎ తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎస్.షబీనా కొంతకాలంగా కాలేయ సమస్యతో బాధపడుతుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను బెంగళూరులోని సెయింట్ జాన్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి వైద్యానికి రూ. 25 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థినులు, కళాశాల నిర్వాహ కులు విరాళాల రూపంలో రూ. 80వేలు సమకూర్చి శనివారం విద్యార్థిని తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లికార్జున, కరస్పాండెంట్ బీరే గోపాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

DURGAM CHINNA MAHBOOB BASHA (OLD NAME) S/o DURGAM BASHA Resident Of D.No-8-4-3, Ganjivaripalli, Talupula. Sri Sathya Sai 51581 Andhra Pradesh. I Have Changed my Name is **DURGAM CHINNA MAHABOOB BASHA (New Name) S/o DURGAM BASHA** Here after my Name is Known as **DURGAM CHINNA MAHABOOB BASHA (New Name) S/o DURGAM BASHA**